క్లుప్తంగా

ఆర్బీకే ద్వారా నాణ్యమైన విత్తనాలు



కె.వెంకటాపురం ఆర్బీకే వద్ద రైతుకు విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

కోటవురట్ల : రబీ సీజన్‌కు సంబంధించి కావలసిన వరి విత్తనాలను ఆర్బీకేలో రిజిస్టర్ చేసుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈశ్వరరావు సూచించారు. కె.వెంకటాపురంలోని ఆర్బీకేలో శుక్రవారం విత్తనాల పంపిణీ చేశారు. ముందుగా రిజిస్టర్ చేసిన రైతులకు విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలతో పాటు రాయితీపై ఎరువులను అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రామ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నేడు

మునగపాక : వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల సమావేశం శనివారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయం వద్ద జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

రాజుపేటలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : రాజుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

మునగపాక : అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ ప్రకాశరావుకు శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేతలు మహేశ్వరరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కౌలు రైతుకు సీసీఎల్‌సీ కార్డులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందే సంక్షేమ పథకాలు దక్కేలా చూడాలన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా ప్రభుత్వం సాయం నేరుగా కౌలు రైతులకు అందేలా చూడాలన్నారు. వినతి అందజేసిన వారిలో సీపీఎం నేతలు బ్రహ్మాజీ, మహేష్ తదితరులున్నారు.

అలరించిన కోలాటం



యలమంచిలి ఎన్‌టీఆర్ కాలనీ భజన బృందం

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీలో ఎన్‌టీఆర్ కాలనీలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి సాయిబాబా మందిరంలో మహిళలు కోలాటం చూపరులను ఆకట్టుకుంది. స్థానిక కాలనీ మహిళలు భక్తి గీతాలను ఆలపించి నృత్యాలతో కోలాటంతో ప్రజలను ఆకర్షించాయి. స్థానిక సాయిబాబా మందిరంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలందరూ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యలు పరిష్కారం

మునగపాక : జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఒంపోలు సచివాలయ కన్వీనర్ నరాలశెట్టి సూర్యనారాయణ అన్నారు. ఒంపోలు సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వలంటీర్లు ఇంటింటా సర్వే చేపట్టడం ద్వారా సమస్యలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, ఎంపీటీసీ బొద్దేడ బుజ్జి, ఎంఎల్‌వో సంజయ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారం జానకీరామ్, వీఆర్వో జోగినాయుడు పాల్గొన్నారు.

రామన్నపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుంటా..

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



రామన్నపాలెంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : రామన్నపాలెం గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రకటించారు. రాజుపేట శివారు రామన్నపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు యల్లపు కుమారరాజా సారథ్యంలో గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామంలో విద్యుత్ తీగెలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోలేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దాంతో విద్యుత్ శాఖ ఏడీఈకి ఫోన్ చేసి వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీపీ స్కూల్ ముందు ఆట స్థలాన్ని జగనన్న కాలనీ లే అవుట్‌కు కేటాయించారని, దీనివల్ల భవిష్యత్‌లో పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని ఫిర్యాదు చేశారు. దగ్గరలోనే సుమారు 18 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నా దాని జోలికి వెళ్లకుండా పాఠశాల స్థలాన్ని కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో వీఆర్వో సూరిబాబుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి ఉండగా పిల్లల ఆటస్థలాన్ని ఎలా తీసుకుంటారని మండిపడ్డారు. ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో గుర్తించి నివేదిక ఇవ్వాలని, దానిని ఇళ్ల స్థలాలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని డీటీ సోమశేఖర్‌ను ఆదేశించారు. తమ గ్రామం రాజుపేటకు సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉందని, శివారు గ్రామంగానే వదిలిపెట్టేయడంతో అభివృద్ధి ఏ కోశానా జరగలేదని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ కొల్లు గోపాలకృష్ణ ఎమ్మెల్యేకు వివరించారు. అభివృద్ధి జరగాలంటే మీరు దత్తత తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తాను ఆ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని అపారిశుద్ధ్యం తాండవిస్తోందని పలువురు ఫిర్యాదు చేశారు. అర్హత ఉన్నా తనకు వికలాంగ పింఛను రాలేదని ఓ వికలాంగుడు ఎమ్మెల్యేకు మొరపెట్టుకోవడంతో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ఆసరా కల్పిస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నారని అన్నారు. చిన్నారులకు బంగారు భవిష్యత్తును ఇచ్చేందుకు విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రైతులను ఆదుకునేలా ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, సర్పంచులు శివరామ్, అనిల్‌కుమార్, శివకుమార్, గోపాలకృష్ణ, అప్పారావు, వరహాలబాబు, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వంగలపూడి రాంబాబు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, శ్రీపతిరాజు, చిట్టిబాబు,నాని, రామునాయుడు, భాస్కరరావు, గెంజి రమణ, ఎస్.వి.రమణమూర్తి, సన్యాసినాయుడు, కొరుప్రోలు రమణ, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ పాల్గొన్నారు.

మినీ కేజీహెచ్‌లా వైద్య సేవలందించాలి



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : విశాఖపట్నంలో ఉన్న కేజీహెచ్ తరహాలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని వాటికి అవసరమైన సదుపాయాలు ప్రభుత్వం ద్వారా తాను సమకూరుస్తానని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. శుక్రవారం ఆయన నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారులు, సిబ్బందితో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సిబ్బంది విషయమై ఆరా తీశారు. ఇక్కడ నుంచి కొంతమంది వైద్యులను డిప్యూటేషన్‌పై ఇతర ఆస్పత్రులకు పంపించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి పెద్దదిక్కుగా సుమారు 30 కిలోమీటర్ల జాతీయ రహదారి కలిగిన ప్రాంతంలో ఈ ఆస్పత్రి ఉందని, ఇక్కడ వైద్యులను వేరొక చోట పనిచేయిస్తే సహించేది లేదని, ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. చాలా ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న ఈ ఆస్పత్రిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 30 పడకల నుంచి 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు రూ.3 కోట్లతో అదనపు భవనాలు, వార్డులు ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ ఆస్పత్రిలో 10 మంది వరకు వైద్యులు, మరో 40 మంది వరకు నర్సింగ్ స్టాఫ్, అటెండర్లు, సబార్డినేట్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఆస్పత్రి స్థాయికి తగ్గ సదుపాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానన్నారు. ఇక్కడ పనిచేసే జనరల్ మెడిసన్ డాక్టర్ డిప్యూటేషన్ రద్దు చేయించి వెనక్కి రప్పిస్తానన్నారు. ఇక్కడకు వస్తున్న పేషంట్లను అనకాపల్లి, విశాఖపట్నం కేజీహెచ్‌లకు రిఫర్ చేస్తున్నారన్న విమర్శలు ఎక్కువగా ఉన్నాయని, ఇకపై అలా జరగడానికి వీల్లేదన్నారు. సిబ్బంది పనితీరు బాగానే ఉందన్నారు. వైద్య సేవల విషయంలో మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. కొత్తగా నియమితులైన డెంటిస్ట్‌కు అవసరమైన డెంటల్ చైర్, ఇతర పరికరాలు సమకూర్చడం కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తాగునీరు, వాడుక నీరు కోసం రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన బోరు, మోటారును ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యుత్ సమస్య కోసం కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తానన్నారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. త్వరలోనే 50 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ అయిన ఈ ఆస్పత్రికి నిర్మించిన నూతన భవనాలను ప్రారంభిస్తామని, అన్ని పనులు పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఈశ్వర ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వీసం నానాజీ, శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారామరాజు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

తమలపాకు రైతులకు పంటల బీమా కల్పించాలి

సీఎంను కోరిన చిక్కాల



సీఎంను కలిసిన చిక్కాల రామారావు

నక్కపల్లి: తమలపాకు రైతులకు కూడా పంటల బీమా వర్తింప జేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కోరడం జరిగిందని, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో సీఎం జగన్‌ను కలిసినట్టు చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తమలపాకు పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందడం లేదన్నారు. ఈ ప్రాంతంలో పండించిన తమల పాకును ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారని, కాబట్టి తమలపాకు రైతులకు పంటల బీమా వర్తింపజేసి ఆదుకోవాలని కోరినట్టు చిక్కాల తెలిపారు. సీఎం ఈ విషయంపై సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో పలు పెండింగ్ సమస్యలను, అభివృద్ధి పనులు సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు.

'అదనపు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి'



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



విద్యుత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న దృశ్యం



విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

మునగపాక : అదనపు కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ మునగపాకలో సీపీఎం నాయకులు రాస్తారోకో చేపట్టారు. ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు పెంచడం తగదంటూ సీపీఎం నేతలు వీవీ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం వాడిన కరెంట్‌కు ఇపుడు అదనంగా బిల్లులు వసూలు చేయడం తగదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రతిపాదన విరమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఆళ్ల మహేశ్వరరావు, సూరిబాబు, రాము, మహేష్, సంజీవరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): విద్యుత్ ఛార్జీలు పెంచారని, వాటిని వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం అచ్యుతాపురం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.సీపీఎం నాయకులు కర్రి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో సోమునాయుడు, గనగల నూకరాజు,బుద్ధ రంగారావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : సీపీఐ, కాంగ్రెసు పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం పాయకరావుపేట ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజలపై అదనపు కరెంటు చార్జీల భారం తగ్గించాలని, ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగతా శ్రీనివాస్, సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యురాలు బందుల సుబ్బలక్ష్మి, పాయకరావుపేట మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, చీడిపల్లి చక్రవర్తి, దార్ల సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గౌరీపతి



కె.వి.గౌరీపతి

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా విశ్రాంత డీఈవో కన్నేపల్లి వెంకట గౌరీపతి ఎన్నికయ్యారు. గురువారం ద్వారకా తిరుమలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఉడ్‌పేటకు చెందిన గౌరీపతి ఎన్నిక అభినందనీయమని జిల్లా అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా గౌరీపతి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖలో వివిధ సేవా కార్యక్రమాలతో పాటు, కరోనా సమయంలో చేతనైనంత మేరకు వృద్ధులకు సాయపడినట్లు పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఎస్.రాయవరం : కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో సోమిదేవపల్లి, గుడివాడ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లలో చెట్టుకొమ్మలు తొలగించే క్రమంలో గుడివాడ ఫీడర్ పరిధిలో గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, పెదఉప్పలం, చినఉప్పలం, రేవుపోలవరం, కొత్తపోలవరం, సోమదేవపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఎర్రవరంలో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరం గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనుల్ని వెంటనే ప్రారంభించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కూలీలు శనివారం ఆందోళన నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణల మేరకు గత సోమవారం నుంచి పనులు నిలిపివేయడం వల్ల కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ఆరు వారాలు చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలు చెల్లించాలని, గ్రామంలో పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలనరసింహం, సింహాద్రి, లక్ష్మి, వరాలమ్మ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోండి



తెరువుపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వీరయ్య

యలమంచిలి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ వీరయ్య అన్నారు. శుక్రవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామంలో మండల స్పెషల్ ఆఫీసర్ అనకాపల్లి డీఎఫ్ఓ లక్ష్మణరావుతో కలసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రజల సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమంలో సంబంధిత ప్రతులను సిద్ధం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో వలంటీర్లు,సచివాలయ సిబ్బంది ప్రజల వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రజలకు సూచనలు సలహాలు అందించాలని గ్రామ సభలో అధికారులను కోరారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం

ఎస్.రాయవరం : దోమలు సమస్య పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు పురస్కరించుకుని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కీటక జనిత వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు

మునగపాక : మండలంలోని చెర్లోపాలెం, చూచుకొండ గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి 11 రకాల సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. శనివారం నుంచి దాదాపు నెల రోజుల పాటు గ్రామాల్లో కేటాయించి తేదీల వారీగా జగనన్న సురక్ష గ్రామ సభలు జరుగుతాయన్నారు. ముందుగా ఎస్.రాయవరం1, తిమ్మాపురం 1 సచివాలయాల్లో తహసీల్దార్ బృందం, ఎంపీడీవో బృందాలతో నిర్వహిస్తామన్నారు.

నేడు భోగాపురం, నునపర్తి గ్రామాల్లో..

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని భోగాపురం, నునపర్తి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. జూలై 28వ తేదీ వర కూ అన్ని గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు.

యలమంచిలి : నేటి నుంచి యలమంచిలి మండలంలో పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు(కన్నబాబు) ఆధ్వర్యంలో జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యలమంచిలి మండల ఎంపీడీవో అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 1వతేదీన కృష్ణాపురం గ్రామం, 4న పులపర్తి, 6న పేటబయ్యవరం, 10న ఏటికొప్పాక -1 సచివాలయం, 12న ఏటికొప్పాక-2 సచివాలయం ,14న పురుషోత్తపురం, 17న పోతిరెడ్డిపాలెం, 19న రేగుపాలెం, 21న లైనుకొత్తూరు, 24న షేకాశిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

రెండు వ్యాన్‌లు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

ఎస్.రాయవరం : గుర్రాజుపేట జంక్షన్ వద్ద రేవు పోలవరం అడ్డురోడ్డు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శుక్రవారం రెండు వ్యానులు ఢీకొని ఒక వ్యక్తి, ఎద్దుకి గాయాలయ్యాయి. ఎస్ఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రాజుపేట వైపు వెళుతున్న టాటాఏస్ వ్యాను, మారుతీ సీ ఫుడ్స్ వ్యాను ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో టాటాఏస్ నడుపుతున్న కురందాసు అప్పారావుకు, ఆ వ్యానులో లోడుతో ఉన్న ఎద్దుకు గాయాలయ్యాయి. ప్రమాదానికి గురైన వారు ఫిర్యాదుతో రాలేదని, రాగానే కేసు నమోదు చేస్తామన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష

- గ్రామాలకు తరలి వెళ్లనున్న అధికార యంత్రాంగం
- గుర్తించిన సమస్యలకు పరిష్కారం
- ఏర్పాట్లు పూర్తి



జగనన్న సురక్ష కార్యక్రమంపై ఇంటింట సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జూలై 1వ తేదీనుంచి నెల రోజుల పాటు మండల స్థాయి అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించనుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే అధికారులంతా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

మండలంలో రెండు బృందాలు

జగనన్న సురక్ష కార్యక్రమం కోసం రెండు బృందాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ , ఈవోపీఆర్‌డీ ఒక బృందంగా(టీమ్1) ఎంపీడీవో డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగా(టీమ్2) ఏర్పడి జూలై ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ఒకటో తేదీన టీమ్ 1 కాగిత, టీమ్ 2 వేంపాడులోను, 3వతేదీన టీమ్ 1 డీఎల్‌పురం, టీమ్2 ఉద్దండపురం, 5వ తేదీన టీమ్1 చందనాడ, టీమ్2 దేవవరం, 7వ తేదీన టీమ్1 అమలాపురం టీమ్2 గొడిచర్ల, 10వ తేదీన టీమ్1 జానకయ్యపేట, టీమ్2 డొంకాడ 12వ తేదీన టీమ్ 1 జానకయ్యపేట2 టీమ్2 చినదొడ్డిగల్లు1 14వ తేదీన టీమ్1 పెదతీనార్ల, టీమ్2 చినదొడ్డిగల్లు2 17వతేదీన టీమ్1 నక్కపల్లి 1 టీమ్2 దోసలపాడు, 19వ తేదీన టీమ్1 నక్కపల్లి2 టీమ్2 పెద దొడ్డిగల్లు 21వ తేదీన టీమ్1 ఉపమాక, టీమ్2 గు ల్లిపాడు, 24వ తేదీన టీమ్1 బంగారయ్యపేట, టీమ్2 రాజయ్యపేట సచివాలయాల్లో అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి క్యాంపులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తారు.

నేటి నుండి లబ్ధిదారులకు అర్హత పత్రాలు

పాయకరావుపేట : ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమగుతున్నాయని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. మండలంలో రెండు టీమ్‌లుగా అధికారులు సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒకటో తేదీన పాయకరావుపేట, పి.ఎల్.పురం సచివాలయాల్లోను, మూడో తేదీన పాయకరావుపేట-2, నామవరం, 5 న పాయకరావుపేట-3, గుంటపల్లి, 7 న పాయకరావుపేట -4, అరట్లకోట, 10 న పాయకరావుపేట-5, మంగవరం, 12 న గోపాలపట్నం, పాల్తేరు-1, 14న పెంటకోట, పాల్తేరు-2, 17 న మాసాహేబుపేట, సత్యవరం-1, 19 న పెదరాంభద్రపురం, సత్యవరం-2, 21 న శ్రీరాంపురం, పాల్మన్‌పేట, 24 న ఎస్.నర్సాపురం, ఈదటం, 26న రాజవరం, కుమారపురం, 28 న వెంకటనగరం గ్రామాల్లో గల ఆయా సచివాలయాల్లో జగనన్న సురక్ష సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ



వీఆర్పీపై విచారణ చేపట్టిన అధికారులు

పాయకరావుపేట: ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదుపై సంబంధిత అధికారులు శుక్రవారం అరట్లకోట గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేసి వేతనాలు తీసుకున్నట్లు వీఆర్పీపై ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఏపీవో హేమలత, పంచాయతీ కార్యదర్శి డి.విజయరాజు ఇక్కడ వేతనదారులను విచారణ చేశారు. పది మంది వేతనదారులు పనులకు వెళ్తున్నట్లు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ముగ్గురు మాత్రం హాజరు కాలేదు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏపీవో తెలిపారు. ఈ విచారణలో సర్పంచ్ పి.అప్పలనర్స, ఉప సర్పంచ్ తూము వెంకటరమణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.వీరబాబు, టెక్నికల్ అసిస్టెంట్ కె.అచ్చుతారావు పాల్గొన్నారు.